# కల చెదిరింది

గుండం రామచంద్రారెడ్డి

వంగదేశానికి విక్రమాదిత్యుడనే సామంతరాజు పాలకుడు. అందరి మన్ననలనూ పొందిన మంచి రాజు. తెలివైన రాజు కూడా. ఇలాంటి రాజునే ఓ భటుడు బోల్తా కొట్టించాలని చూశాడు. ఫర్మానాలు పొందాలని ప్రయత్నించాడు. బహుమానాలు సొంతం చేసుకోవాలని చూశాడు.

ఇందులో భాగంగానే ఓరోజు రాజు మందిరంలోకి వెళ్లి...

''మహారాజా! మీరు సామంత రాజు పదవినుంచి తప్పుకునే రోజులు మరెంతో దూరంలో లేవు'' అన్నాడు.

రాజు నమ్మలేకపోయాడు ఆయన మాటలు.

వెంటనే రాజు ''ఏమిటీ నువ్వనేది. స్పష్టంగా వివరించు'' అన్నాడు.

''మహారాజా! త్వరలోనే వంగ, కళింగ, సింహళ మొదలైన అన్ని రాజ్యాలకు మీరే అధినేతలు కాబోతున్నారని నాకు కల వచ్చింది. ఇంతవరకూ నాకొచ్చిన కల ఎప్పుడూ అవాస్తవం కాలేదు'' అన్నాడు.

అది విన్న రాజు ఉప్పొంగి పోకుండా మంత్రిని పిలిపించి ''వచ్చే తదియనాడు ఆ భటునికి భారీ సన్మానాన్ని ఏర్పాటు చేయండి. బహుమానాలను తెప్పించండి. కార్యక్రమం కళ్లు చెదిరేలా వుండాలి'' ఆదేశాలు జారీ చేశాడు విక్రమాదిత్యుడు.

తదియ లోగా భటుని గుణ గణాలు, ప్రవర్తన అన్నీ తెలుసు కున్నాడు.

భటుడు సన్మాన సత్కారాలు పొందాల్సిన రోజు రానే వచ్చింది. అతని ఆనందానికి అవధుల్లేవు. 'ఒక్క అబద్ధమాడినందుకే నాకింత యోగమా. అయినా అబద్ధమాడటంలోనూ కళ వుండాలి సుమా!' అనుకుంటూ భటుడు గెంతులేస్తున్నాడు.

తదియ రోజు సాయంత్రం సన్మాన కార్యక్రమం. వంగదేశానికి చెందిన ప్రజలందరూ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు.

చూస్తూండగానే సమావేశానికి రాజు హాజర య్యారు. అతని వెనకాలే మహారాణి కూడా వచ్చి ముందువరుసలో ఆసీనురాలైంది. వెంటనే మంత్రు లూ, సామంతులందరూ వచ్చారు. రాజు భటుని కిచ్చే బహుమానాలేమిటనేదే అందరి ఉత్కంఠ.

ఆసీనులైన రాజు ప్రజలందరికీ చేతులెత్తి నమస్కరించి...

''వంగదేశ ప్రజలారా! నేటి కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ఈ భటుని సన్మాన కార్యక్రమం'' అంటూ వెనక వైపు వున్న భటుని పిలిపించాడు.

అక్కడికొచ్చిన బహుమానపు పెట్టెలన్నీ చూసి భటుడు లోలోపల మురిసిపోతున్నాడు. ఇవన్నీ తన ఇంటికొస్తే రాజు కొలువులో వుండక్కర్లేదని మనసులోనే అనుకుంటున్నాడు.

రాజు తన ప్రసంగం మొదలుపెడుతూ ''కేవలం భటునికొచ్చిన కలకే ఇంత సన్మానం ఏర్పాటు చేశానని మీరు ఆశ్చర్యపోతున్నారా. నిజమే నేను ఇన్ని దేశాలకు రాజునవబోతున్నానంటే అతనికి సన్మానం చేయాల్సిందే కదా'' అన్నాడు.

ఎదురుగా వున్నవారందరూ చెవులు రిక్కించి వింటున్నారు.

భటుని తన దగ్గరే నిల్చోమని చెబుతూ అతనితో ''మిత్రమా! నీకు కల ఏరోజు వచ్చింది'' అని అడి గాడు.

''మహారాజా! మొన్నటి గురువారం అర్ధరాత్రి కల వచ్చింది'' అన్నాడు.

''అప్పుడు నువ్వు ఎక్కడ వున్నావు''

''మందిరంలోనే మహారాజా''

''విధుల నిర్వహణలోనా?''

''అవును రాజా''

ఇక్కడే రాజు అసలు కిటుకు అందరికీ చెప్పాడు.

''ప్రజలారా! వినండి. ఇలాంటి నిద్రపోతులకు సన్మానం కాదు.. దేశంనుంచి వెళ్లగొట్టాలి'' అన్నాడు.

ప్రజలంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు.

''ఏమిటి మహారాజా మీరనేది?'' అన్నారు మంత్రి.

''అవును మహామంత్రి! వీడు విధి నిర్వహణలో కలగన్నాడంటే నిద్దురపోయినట్టే కదా. అంటే ఇతను పనిచేయట్లేదు''

అందరి సమక్షంలోనే భటుని పదవినుంచి తీసేయడమే కాకుండా, రాజ్య బహిష్కారం కూడా చేశారు.

అబద్ధమాడితే నష్టం విదియ నాడు కాక పోయినా తదియనాడైనా తప్పదు

